రూ.కోటి వృథా

- నర్సరీ కోసం తమదికాని స్థలంలో ప్రహరీ, భవనం నిర్మించిన జీవీఎంసీ
- అటవీ శాఖ అభ్యంతరంతో నిరుపయోగంగా భవనం
- అధికారుల అనాలోచిత నిర్ణయంతో ప్రజాధనం వృథా
- నర్సరీ ఓ చోట.. మొక్కలు ఇంకో చోట ఉండడంతో ఇబ్బందులు

ఆరిలోవ : తొందరపాటు.. నిర్లక్ష్యం .. అనాలోచిత నిర్ణయం.. కారణం ఏదైనా జీవీఎంసీ అధికారుల వల్ల **కోటి** రూపాయల ప్రజాధనం వృథా **అయింది.** జీవీఎంసీ నర్సరీ నిర్వహణ కోస**మని చేపట్టిన** నిర్మాణాలు తమ స్థలంలో కాద**ని... అటవీ శాఖ** పరిధిలోని స్థలంలో అని తెలుసు**కుని నాలుక్కరుచు**కున్నారు. ఫలితంగా ప్రజాధనం **వృథాతోపాటు**

అటవీశాఖ నోటీసులతో చేసేదిలేక...

దీన్‌దయాల్‌పురం వద్ద స్థలంలో పార్కు నిర్మాణం చేపట్టడంతో అంత వరకు అక్కడ నిర్వహించిన జీవీఎంసీ నర్సరీని ముడసర్లోవ రిజర్వాయరు వెనుక కంబాలకొండను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలోకి తరలించదలిచారు. అందుకోసం సుమారు రూ.కోటి నిధులతో జీవీఎంసీ ఉద్యానవనాధికారులు కొత్తగా నర్సరీ నిర్మాణ పనులు ప్రారంభించారు. అక్కడి స్థలాన్ని చదునుచేసి కంబాలకొండ వైపు ఇనుప మెస్‌తో కంచె ఏర్పాటు చేశారు. రోడ్డు వైపు సుమారు 300 మీటర్ల పొడవున ప్రహరీ నిర్మించారు. దాని లోపల ఆఫీస్ కోసం పక్కా భవనం నిర్మించేశారు. లోపల స్థలాన్ని చదునుచేసి మొక్కలు సిద్ధం చేయదలిశారు. అంతవరకు బాగానే జరిగిపోయింది. ఆ స్థలానికి సంబంధించిన అసలు విషయం జీవీఎంసీ అధికారులకు అప్పుడే తెలిసింది. ఆ స్థలం జీవీఎంసీది కాదని, అటవీశాఖకు సంబంధించినదని తెలుసుకుని నాలుక్కరుచుకున్నారు. మా స్థలంలో నిర్మాణం ఎలా చేపడతారంటూ అటవీశాఖ అధికారులు కొద్ది రోజుల క్రితం జీవీఎంసీకి నోటీలు పంపించారని సమాచారం. దీంతో చేసేదిలేక ఆ నిర్మాణాన్ని వినియోగించుకోలేక నిరుపయోగంగా వదిలేశారు.



నర్సరీ లోపల నిర్మించిన భవనం



ముడసర్లోవ రిజర్వాయరు వెనుక కంబాలకొండ అంచున జీవీఎంసీ నర్సరీ కోసం నిర్మించిన ప్రహరీ



దీన్‌దయాల్‌పురం వద్ద బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని పాత నర్సరీ స్థలంలో నిల్వ ఉంచిన వివిధ రకాల మొక్కలు

జీవీఎంసీ నర్సరీ ఓ చోట ఉంటే మొక్కలు **మరో చోట నిల్వ** చేసే పరిస్థితి నెలకొంది. **అక్కడ నర్సరీ కోసం ని**ర్మాణం చేపట్టారు కదా అని **ఎవరైనా వ్యయప్రయా**సలు పడి వెళ్తే... పెంచుకోవ**డానికి అవసరమైన** మొక్కలకు బదులు పనికిరాని పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే... చినగదిలి ప్రాంతం దీన్‌దయాల్‌పురం వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన కొన్నేళ్లుగా జీవీఎంసీ నర్సరీ నిర్వహించేది. సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో నిర్వహించే ఈ నర్సరీ స్థలంలో జీవీఎంసీ పిల్లల పార్కు నిర్మిస్తోన్న విషయం తెలిసిందే. ఎంతో ఆహ్లాదకరమైన ఈ ప్రాంతంలో పాత్‌వేలు, పార్కులు, పిల్లల విజ్ఞాన థియేటర్లు, ఆట పరికరాలు తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ పిల్లల పార్కు నిర్మాణంలో భాగంగా సుమారు ఏడాదిన్నర క్రితం నుంచి పనులు జరుగుతున్నాయి.

నిర్మాణానికి ప్రజాధనం వృథా

ముడసర్లోవ రిజర్వాయరు వెనుక స్థలం తమదో..? కాదో..? తెలుసుకోకుండా సుమారు కోటి రూపాయల ప్రజాధనాన్ని జీవీఎంసీ అధికారులు ఖర్చు చేసేశారు. అధికారుల అనాలోచిత చర్యలు వల్ల ప్రజాధనం వృథా అయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ నిర్మాణం ప్రస్తుతం పనికిరాని పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అక్కడ కొత్తగా నిర్మించిన నర్సరీలో మొక్కలు కోసం వెళ్లేవారికి దట్టమైన పిచ్చి మొక్కలే కనిపిస్తున్నాయి. అందులో నిల్వ ఉంచాల్సిన వివిధ రకాల మొక్కలను దీన్‌దయాల్‌పురం వద్ద బీఆర్‌టీఎస్ పక్కన నిర్మాణంలో ఉన్న పిల్లల పార్కులోనే అనధికారికంగా ఉంచాల్సి వచ్చింది. ఇక్కడ కొబ్బరి, జామ, నేరేడు, తులసి, నిద్ర గన్నేరు, వేప, బాదం, తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయి. జీవీఎంసీ అధికారులు ఏది తమ స్థలమో తెలుసుకోకుండా నిర్మాణం చేపట్టి ప్రజా ధనం వృథా చేయడంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిల్లల పార్కు నిర్మాణం కొద్ది రోజుల్లో పూర్తికానుంది. ఈ పార్కు పూర్తయి అందుబాటులోకి వస్తే ఇక్కడ ఉన్న నర్సరీ ఎక్కడ ఏర్పాటు చేయాలో తెలియక ఉద్యానవన శాఖాధికారులు తలలు పట్టుకొంటున్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



బీచ్‌రోడ్డు : వైఎస్సార్ సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శనివారం ప్రకటించారు. ఏడు అనుబంధ విభాగాలకు అధ్యక్షుల పేర్లు విడుదల చేశారు. మహిళ విభాగానికి కరకట్ల శిరీష, ఎస్సీ సెల్‌కు బంగారు భవానీ శంకర్, ఎస్టీ సెల్‌కు కిముడు భాస్కర్ కుమార్, మైనార్టీ సెల్‌కు ఎండీ మాక్బుల్, నేత కార్మికుల వింగ్‌కు సూరిశెట్టి రావలు, పబ్లిసిటీ వింగ్‌కు సంపంగి సురేష్ బాబు, ఇంటలెక్చువల్స్ ఫోరమ్‌కు అధ్యక్షునిగా చెంబూరు వెంకటరావును ఎంపిక చేశారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న ఆరిలోవ పోలీసులు

ఆరిలోవ : ఆరిలోవ పోలీసులు శనివారం తెల్లవారుజామున వాహన తనిఖీలు చేపట్టారు. జీవీఎంసీ పదో వార్డు పరిధి శ్రీకాంత్‌నగర్ దరి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో తెల్లవారేసరికి ఆరిలోవ సీఐ హెచ్.మల్లేశ్వరరావు, ఎస్ఐ కృష్ణ, మరో 10 మంది సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. వీధిలో ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్ర వాహనాలు, ఆటోలను పరిశీలించారు. వాటి యజమానుల వద్ద వాహనాలకు సంబంధించిన పత్రాలు పరిశీలించారు. పత్రాలు చూపని ఏడు ద్విచక్ర వాహనాలను ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాటికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు చూపించి వాహనాలు తీసుకెళ్లాలని వారికి సీఐ సూచించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోలు, బైక్‌లు, తదితర ఏ వాహనాలకైనా అన్ని డాక్యుమెంట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. వాహనదారులకు లైసెన్సు తప్పనిసరి అని సూచించారు.

‘చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలే’

బీచ్‌రోడ్డు : తల్లికి వందనం పథకం లోకేష్ ఆలోచనల నుంచి పుట్టిందని ముఖ్యమంత్రి చంద్రబాబు సిగ్గు లేకుండా అబద్ధాలు చెప్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద విద్యార్థుల కోసం అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించారని గుర్తు చేశారు. ఆయన ఆలోచనలను కాపీ కొట్టి పథకం పేరు మార్చి... లోకేష్ ఆలోచనల నుంచి వచ్చిందని విద్యార్థులకు చంద్రబాబు అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. నాడు – నేడు ద్వారా స్కూళ్ల రూపురేఖలు మార్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదని... దాన్ని కూడా కూటమి ప్రభుత్వ ఖాతాలో వేసుకోవాలనుకోవడం నీచమైన చర్య అన్నారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు తన సొంత ఆలోచనలతో ఒక్క పథకం కూడా ప్రజలకు అందించలేదన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సిరులతల్లికి తులసిపూజ



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వర రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళల ప్రదర్శనకు విశేష స్పందన



చేనేత వస్త్రాల వద్ద సందడిగా సందర్శకులు

బీచ్‌రోడ్డు : చేనేత హస్తకళ కార్మికులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకుడు సురేష్ తెలిపారు. భావన రుషి చేనేత హస్తకళ కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో పోచంపల్లి, నారాయణ్‌పేట్, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారి, ఫ్యాన్సీ ఖాదీ, కాటన్ ప్రింటెడ్ బెంగాల్ సిల్క్, జైపూర్ బెడ్‌షీట్స్ వంటి వాటితో 40 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ఆదివారంతో ముగుస్తుందని తెలిపారు.

పాడేరులో ఇగ్నో అధ్యయన కేంద్రానికి సన్నాహాలు



ఇగ్నో కేంద్రం ఏర్పాటు కోరుతూ వినతిపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ చిట్టిబ్బాయి

ఎంవీపీ కాలనీ : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) అధ్యయన కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఇగ్నో డైరెక్టర్ డాక్టర్ ధర్మారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాడేరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.చిట్టిబ్బాయి ప్రతిపాదన మేరకు త్వరలోనే కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. శనివారం ఉషోదయ కూడలిలోని ఇగ్నో ప్రాంతీయ కార్యాలయంలో కేంద్రం ఏర్పాటుపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ధర్మారావు మాట్లాడుతూ ఇగ్నో ద్వారా లక్షల మంది యువత ఉన్నత విద్యను అందిపుచ్చుకుంటున్నారన్నారు. పాడేరులో అధ్యయన కేంద్రం ఏర్పాటు చేస్తే గిరిజన యువతీ యువకుల ఉన్నత చదువుకు బాటలు పడతాయన్నారు. కేంద్రం ఏర్పాటుకు ప్రిన్సిపల్ చిట్టిబ్బాయి ముందుకు రావడం పట్ల అభినందనలు తెలిపారు. త్వరలోనే ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బీచ్‌రోడ్డు : మద్యం మత్తులో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లల ఎండాడకు చెందిన ఉమామహేశ్వరరావు (40) మద్యానికి బానిసగా మారాడు. దీంతో అతడిని భార్య విడిచిపెట్టింది. అప్పటి నుంచి మరింతగా మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి ఎక్కడపడితే అక్కడ పడిపోతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మద్యం అధికంగా సేవించి వుడా పార్క్ ఎదురుగా ఉన్న జీసీసీ షాపుల వద్ద నిద్రపోయాడు. ఉదయానికి కదలిక లేకపోవడంతో అనుమానం వచ్చి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించగా అప్పటికే మరణించినట్లు గుర్తించారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పరామర్శ



కార్యకర్తతో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డు రజకవీధిలో నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త గుర్రాల రాజును పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు శనివారం పరామర్శించారు. రాజు ఆరోగ్య పరిస్థితి బాగోలేక ఇంటిలోనే వుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న అప్పారావు ఆయన ఇంటికి వెళ్లి యోగక్షేమాలు తెలుసుకున్నారు. భగవంతుని దయతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, త్వరగా కోలుకుని పార్టీకి సేవలు అందించాలని కోరారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్, వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు గుర్రాల శ్రీను, నాని పరామర్శించారు.

ఘనంగా పాపాహోం రజతోత్సవం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ



అలరించిన పాపాహోం పిల్లల ప్రదర్శన

డాబాగార్డెన్స్: పోలీస్ రిజర్వ్ బ్యారెక్స్ ప్రాంగణంలో నడుస్తున్న పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోం) 25వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్, పాపాహోమ్ చైర్మన్ శంఖబ్రత బాగ్చీ, హోమ్ వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పాపాహోమ్ కమిటీ, విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. అప్పుడే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. పాపాహోమ్‌లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు బాగా చదువుకుని ప్రయోజకులై అత్యున్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. పాపాహోమ్ వ్యవస్థాపకుడు కోడె దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వివిధ కారణలచే నిరాదారణకు గురైన బాల బాలికలను చేరదీసి, వారిని బాగు చేస్తే మంచి భవిష్యత్ కలిగి చక్కగా జీవిస్తారని, తద్వారా స్థిరపడతారని తెలిపారు. 25 ఏళ్లుగా చక్కని ఆశయాలతో పాపాహోమ్ అభివృద్ధికి కృషి చేస్తున్న కమిటీ సభ్యులు, సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ కమిషనర్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) డాక్టర్ అజిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ పాపాహోం ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాల తీరు ప్రశంసించారు. ఈ సందర్భంగా పాపా పిల్లలచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో డాక్టర్ అస్లాం ఆరిఫ్, రాజగోపాలరాజు, ఉపాధ్యక్షుడు పంపాన వెంకటేశ్వరరావు, కార్యదర్శి ప్రకాశరావు, కోశాధికారి రమేష్‌చంద్ జైన్, ఎంపీ రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు, పాపాహోమ్ బాల బాలికలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కళ తప్పిన ఫౌంటైన్



ఒకప్పుడు రంగుల నీటితో ఫౌంటైన్



పెదగదిలి కూడలిలో ప్రస్తుతం పనిచేయని ఫౌంటైన్

ఆరిలోవ : జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి పెదగదిలి వద్ద బీఆర్‌టీఎస్ కూడలిలో రంగుల నీటితో కనువిందు చేసే ఫౌంటైన్ మూలకు చేరింది. ఈ కూడలిలో పాడుబడిన పెద్ద నుయ్యి నిరుపయోగంగా ఉండేది. దాన్ని మూడేళ్ల క్రితం కూడళ్ల అభివృద్ధిలో భాగంగా అప్పటి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సూచనలతో జీవీఎంసీ అధికారులు వాటర్ ఫౌంటైన్‌గా తీర్చిదిద్దారు. నీలం, గులాబీ, ఆకుపచ్చ, పసుపు తదితర రంగుల నీటిని విరజిమ్ముతూ స్థానికులకు, అటుగా వెళ్లే వాహనచోదకులకు కనువిందు చేసేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ ఫౌంటైన్ కళ తప్పింది. దీని నిర్వహణను పట్టించుకునే వారు లేక ఫౌంటైన్ మూలకు చేరింది. దీంతో రంగులు నీరు పైకి రావడం లేదు. ప్రజలకు ఆహ్లాదం, అందాన్ని అందించే ఫౌంటైన్లను సైతం కూటమి పాలకులు మూలకు చేర్చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఈ ఫౌంటైన్‌కు మరమ్మతులు జరిపించి పనిచేసేలా చూడాలని కోరుతున్నారు.

సోలార్ విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు

గాజువాక: గృహ విద్యుత్ వినియోగదారులు సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడంద్వారా వివిధ ప్రయోజనాలు పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు అన్నారు. సోలార్ విద్యుత్ ప్రయోజనాలపై శ్రీనగర్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా బ్యాంకు నుంచి రూ.78 వేలు సబ్సిడీ పొందవచ్చన్నారు. ఈ పథకంలో బీసీలకు అదనంగా మరో రూ.20వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు ఈ పథకాన్ని పూర్తిగా ఉచితంగా పొందవచ్చన్నారు. సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడంవల్ల వినియోగదారుల విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండదని, మిగులు విద్యుత్ ఉంటే ప్రభుత్వమే తీసుకొని నగదు చెల్లిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సోలార్‌పవర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, మాజీ కౌన్సిలర్ పప్పు రాజారావు, ఏపీఈపీడీసీఎల్ ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ రామకృష్ణ పాల్గొన్నారు.

ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం

తాటిచెట్లపాలెం : మనువాద కార్పొరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రజా, దళిత, పౌర సంఘాలు సమరశీల పోరాటాలు చేయాలని కారంచేడు ఉద్యమ సామాజిక కార్యకర్త భగత్‌సింగ్ పిలుపునిచ్చారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కారంచేడు దళిత అమరవీరుల 40వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారంచేడులో 1985 జూలై 17న దళితుల నెత్తురు ఏరులై పారిందని, ఒక పథకం ప్రకారం చుట్టుపక్కల గ్రామాల కమ్మ భూస్వామ్య వర్గం అధికార మదంతో జరిపిన దాడిలో ఐదుగురు దళితులు అసువులు బాసారని, సుమారు 100 మందిని వెంటపడి తీవ్రంగా గాయపరచి, మహిళలపై అత్యాచారాలు చేశారని నాటి సంఘటలను గుర్తు చేశారు. ఆనాటి ఉద్యమానికి, బాధిత దళితులకు దళిత సంఘాలు, అంబేడ్కర్ సంఘాలు, విప్లవ పార్టీలు, కమ్యూనిస్టు పార్టీలు అండగా నిలిచాయన్నారు. న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు వై.కొండయ్య మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు తమ అజెండాను శక్తివంతంగా అమలు చేసేందుకు ప్రజల మధ్య విద్వేషాలను సృష్టించి, ప్రజాపోరాటాలను దెబ్బతీయగలిగే శక్తులను అన్వేషించాయని తెలిపారు. కార్యక్రమంలో సావిత్రీబాయి ఫూలే ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి, న్యూ డెమోక్రసీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ఏరియా కమిటీ నాయకులు కె.నిర్మల, భీం సేన వార్ అధ్యక్షుడు కె.చిన్నారావు, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, దళిత విముక్తి కన్వీనర్ ఎస్.వి.రమణ, భారత నాస్తిక సమాజం జీడీ సారయ్య, ప్రజాపోరు ప్రతినిధి దేవా, ప్రజా సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

‘స్మార్ట్’ మీటర్లను తిరస్కరించండి

- స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వ్యతిరేక ర్యాలీలో సీపీఎం నాయకులు



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

పెందుర్తి: ‘గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామంటే తరిమికొట్టండని పిలుపునిచ్చిన మంత్రి లోకేష్ ఇప్పుడు ఆదానీ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడానికి సిద్ధం కావడం సిగ్గుచేటు’ అని సీపీఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బి.జగన్ విమర్శించారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధమైన స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ‘ఆదానీ స్మార్ట్ మీటర్లు వద్దు–పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు’ అనే నినాదంతో జీవీఎంసీ 97వ వార్డు కార్మికనగర్‌లో శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ప్రజలు ప్రస్తుతం తాము వినియోగించిన విద్యుత్‌కు మాత్రమే బిల్లులు కడుతున్నారని.. అదే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే వినియోగదారులపై తీవ్ర భారం పడుతుందన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ప్రజలను వంచిస్తూ ఆదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోందని మండిపడ్డారు. ఒక్కో మీటరుకు కేటగిరీలను బట్టి రూ.8,927, రూ.17,286 వసూలు చేయాలని నిర్ణయించడం దారుణమని చెప్పారు. పైగా గతంలో బిల్లులు చెల్లింపునకు కనీసం 15 రోజుల గడువు ఉండేదని కానీ ఇప్పుడు స్మార్ట్ మీటర్ల పుణ్యమా అని ముందుగానే విద్యుత్‌కు రీచార్జ్ చేసుకునే దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పొరపాటున రీచార్జి చేసుకోకపోతే ప్రజలు చీకట్లో బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ చార్జీల ప్రక్రియ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం వల్ల సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని సూచించారు. లేకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ కమిటీ నాయకులు బి.వెంకటరావు, బి.రమణి, కె.అప్పలనాయుడు, రామారావు, ఈశ్వరరావు, నాయుడు, గోపి, మహేష్, రాజు, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో సింహగిరి కిటకిట



నీలాద్రిగుమ్మం వద్ద భక్తుల రద్దీ

సింహాచలం : సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. రెండవ శనివారం సెలవురోజు కావడంతో పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గిరి ప్రదక్షిణరోజు 32 కిలోమీటర్లు ప్రదక్షిణ చేసి, సింహగిరిపైకి వెళ్లని పలువురు భక్తులు కూడా వచ్చారు. బస్సులు, అన్నప్రసాద భవనం కిటకిటలాడాయి.

రాష్ట్ర ఫుట్‌బాల్ జూనియర్ బాయ్స్ క్యాంప్ ప్రారంభం నేడు

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో రాష్ట్ర ఫుట్‌బాల్ జూనియర్స్ క్యాంప్ ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్టు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అక్కరమాని చినబాబు తెలిపారు. రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ సూచనల మేరకు ఈ నెల 22 వరకు ఈ క్యాంప్ జరుగుతుందన్నారు. క్యాంప్ ముగిసిన అనంతరం ఈ జట్టు మధ్యప్రదేశ్‌లో జరిగే పోటీలలో పాల్గొనుందన్నారు.